క్లుప్తంగా

జాతీయ వాస్కులర్ డే సందర్భంగా వాక్‌థాన్



గుంటూరు మెడికల్: జాతీయ వాస్కులర్ డే సందర్భంగా ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిసా కూడలి వరకు వాక్‌థాన్ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. శరీరంలో రక్తనాళాల ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యం కోసం అందరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ శరీరంలో రక్త ప్రసరణ అనేది చాలా ముఖ్యమైందని తెలిపారు. అవయవాలలో ఎక్కడైనా నల్లటి మచ్చలు కనబడితే రక్తప్రసరణలో తేడాలు ఉన్నట్లు గుర్తించి తక్షణమే వాస్కులర్ వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. గుంటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు వాస్కులర్ సర్జరీ ప్రాముఖ్యతను వివరించారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ తరఫున హాజరైన డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒంటి మీద ఏదైనా నల్లటి మచ్చలు కనబడితే కచ్చితంగా తమను సంప్రదించాలని తెలిపారు. ఈ మధ్య కాలంలో మధుమేహ బాధితులకు వేళ్లు, కాళ్లను తీసివేస్తున్నారని, రక్తనాళాల్లో ఇబ్బందుల వల్ల, రక్త ప్రసరణ సరిగ్గా లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ రెడ్డి, సురేంద్ర నాగులపాటి, స్వప్న కందిమళ్ల, మొహమ్మద్ షఫీఉల్లా, నగరంలోని వివిధ కళాశాల, వైద్యశాలల వైద్యులు , విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల భక్తి గాన నీరాజనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నవకళోదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల భక్తిగాన నీరాజనం నిర్వహించారు. పీఎల్ఎన్ మూర్తి నిర్వహణలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, నవ కళోదయ సభ్యుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు టి.సుధీర్, ఆర్.పి.ఎల్.నరసింహారావు, అన్నపూర్ణ, నారాయణ, మోహన్, అశోక్, వెంకాయమ్మ పాల్గొన్నారు. తిరు వెంకటాదీశ జగదీశా, ఎంతెంత దయనీది ఓ సాయి, ఏడుకొండల స్వామి ఎక్కడున్నావయ్య, పిలిచిన పలుకవే ఓ స్వామి వంటి భక్తి గీతాలు హృద్యంగా ఆలపించారు.

అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/4వ అడ్డ రోడ్డులోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ అమావాస్య సందర్భంగా ఆదివారం అమ్మవారి శ్రీచక్ర మహా మేరుకు విశేష పంచామృత అభిషేకాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. గుమ్మడికాయలతో పూజలు చేసి భక్తులకు అందించారు. అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో ప్రార్థనలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అమావాస్య ఆదివారం కూడా కలసి రావడంతో దర్గా ప్రాంగణమంతా భక్తులతో కళకళలాడింది. భక్తులు దర్గా ప్రాంగణంలో ఉన్న షఫా బావి నీటితో స్నానాలు చేసి ప్రదక్షిణలు చేశారు. బాజీ బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులు బాబా వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు రాత్రి దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేశారు. దాతలు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సిబ్బంది అంత్రాలు, దిష్టికాయలు, వాహన పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా బాజీబాబా దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లు.. సమస్యల గూళ్లు

- గుంటూరు నగర పరిధిలోని జెడ్పీ, కార్పొరేషన్ స్కూళ్లలో టీచర్ల కొరత
- ఉన్నత పాఠశాలల్లో వేధిస్తున్న సబ్జెక్టు టీచర్ల సమస్య
- పాఠశాలలు పునఃప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా దృష్టి సారించని ప్రభుత్వం
- గుంటూరు నగర పరిధిలో ఖాళీగా ఉన్న 150 పోస్టులు
- డీఎస్సీలో చేర్చామని చెప్పి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం
- గత ప్రభుత్వం అమలు పర్చిన గోరుముద యథాతథంగా అమలు
- గుంటూరు అర్బన్, రూరల్ పరిధిలో 158 పాఠశాలల్లో 22వేల మంది విద్యార్థులు
- ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 150 టీచర్ పోస్టులు



నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకున్న భోజనాన్ని ఆరగిస్తున్న విద్యార్థులు

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పాగా వేశాయి. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీతో పాటు బోధనకు తగినంత మంది ఉపాధ్యాయుల్ని నియమించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా రూపకల్పన చేసిన జగనన్న గోరుముద్ద మెనూనే ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతోంది. విద్యార్థుల సంతృప్తే ధ్యేయంగా గత ప్రభుత్వం అమలు పర్చిన మధ్యాహ్న భోజనంలో అందించిన ఆహార పదార్థాల్ని ప్రస్తుతం అందిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని స్వయంగా విద్యార్థులు, తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

- గుంటూరు నగరపాలకసంస్థ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలలతో పాటు రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న జెడ్పీ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు హైస్కూళ్లలో ప్రధానమైన తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించేందుకు అవసరమైన స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ

సబ్జెక్టు టీచర్ల కొరత

గుంటూరు అర్బన్, రూరల్ మండలాల పరిధిలో ఏడు ప్రభుత్వ పాఠశాలలు, 52 జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలతో పాటు 99 నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టుల్ని భర్తీ చేయడం లేదు. బోధనకు సరిపడా ఉపాధ్యాయుల్ని ప్రభుత్వం నియమించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. విద్యార్థులకు పాఠ్యాంశాల్ని బోధించేందుకు ఉపాధ్యాయులు కరువయ్యారు. ఆయా పాఠశాలల్లో 22వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా వెయ్యి మంది ఉపాధ్యాయులు పని చేయాల్సి ఉండగా, వారిలో ప్రస్తుతం 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కుంటుపడుతున్న బోధన

పాఠశాలలు పునఃప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు అకడమిక్ కేలండర్ ప్రకారం రోజువారీగా పాఠ్యాంశాలను బోధన సక్రమంగా సాగడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యాబోధనకు కీలకమైన టీచర్ పోస్టులను ఎప్పటికప్పుడు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రస్తుతం ఆ దిశగా చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు.

విధంగా గుంటూరు నగర పరిధిలోనే 150కు పైగా పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు బోధన నామమాత్రంగా సాగుతోంది.

స్టూడెంట్ కిట్ల పంపిణీలో జాప్యం

గుంటూరు అర్బన్, రూరల్ మండల పరిధిలోని 212 ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల పరిధిలో 28,603 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసేందుకు ఇండెంట్ పంపించారు. అయితే పాఠశాలలు తెరిచిన తరువాత పంపిణీ ఆలస్యంగా జరిగింది. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు ఇంకా పంపిణీ కావాల్సి ఉంది.

మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు 60 శాతమే

గుంటూరు నగర పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, నగరపాలకసంస్థ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థుల్లో 60 శాతం మందే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.అది కూడా రుచించకపోవడంతో మిగిలిన విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు.

డెప్యూటేషన్‌పై నియమించాలి



సబ్జెక్టు టీచర్ల కొరత నివారించేందుకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉన్న దృష్ట్యా తక్షణమే డెప్యూటేషన్‌పై వారిని నియమించాలి. మున్సిపల్ ఉపాధ్యాయులను నిబంధనల మేరకు అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. యూపీ నుంచి అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లలో టీచర్లు లేకపోవడంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది.

– బి.హైమారావు, ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

టీచర్ల బదిలీల్లో పటిష్ట చర్యలు అవసరం



ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు పంపడం ద్వారా బోధనకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చు. ప్రభుత్వం చేపడుతున్న పని సర్దుబాటు ద్వారా పాఠశాలల్లో బోధనకు సరిపడా ఉపాధ్యాయులను నియమించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

– ఎస్.వి.జగదీష్ కుమార్, ఎన్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయుల సర్దుబాటులో పారదర్శకత పాటించాలి : ఏపీటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా జరపాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె..బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:20 ఉండేటట్లు చూడాలని కోరారు. పాఠశాల విద్యకు గొడ్డలి పెట్టుగా ఉన్న జీవో 117కి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందన క్రింద రూ.15 వేలు చెల్లించాలని కోరారు. ఒక పక్క ప్రైవేట్,కార్పొరేట్ విద్యాలయాలు ఊకదంపుడు ప్రచారాలతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను లాక్కుపోతుంటే, మూలిగే నక్క పై తాటికాయ పడ్డ చందంగా 60 మంది దాటితేనే మూడవ ఉపాధ్యాయుడిని ఇస్తామనడం సరైనది కాదని సూచించారు. ప్రతి ఉన్నతి పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ కొరత లేకుండా చూడాలని కోరారు. గత జనవరి నుంచి వేలాది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేస్తున్నారన్నారు.

పోయిన ఒక్క జులైలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆరు మంది పదవీ విరమణ చేశారని వివరించారు. ప్రాథమికోన్నత పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడ్ని కంపల్సరీగా ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ యూ డైస్ ఆధారంగా ఆన్‌లైన్‌లో జరుగుతుందని విద్యాశాఖాధికారులు చెబుతున్న నేపథ్యంలో ప్రతి ఉపాధ్యాయుడు తమ పూర్తి వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు తమ యూ డైస్ అప్డేషన్ చేసుకోవాలని వారు కోరారు. సర్దుబాటు ప్రక్రియ మాన్యువల్‌గా ఉండబోదని, వివాదాలకు తావులేకుండా ప్రక్రియను హేతుబద్ధంగా, పారదర్శకంగా జరపాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేసింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగ పరిశోధకురాలు ఎ. సంగీత సంఖ్యాయనికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఆమె ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ పి. బ్రహ్మాజీరావు పర్యవేక్షణలో ' క్యారక్టరైజేషన్ ఆఫ్ నానో కాపర్ ఆక్సైడ్ పార్టికుల్స్ ఎక్స్‌ట్రాక్ట్ ఫ్రమ్ ఈ వేస్ట్ అండ్ ఎఫిషియన్సీ అండ్ వాటర్ క్వాలిటీ క్రైటీరియా' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ అధ్యయనకేంద్ర పరిశోధకుడు కె. రత్నానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్



సంగీత సంఖ్యాయని



రత్నం

పి. సుధాకర్ తెలిపారు. ఆయన అంబేడ్కర్ అధ్యయన కేంద్రానికి చెందిన కె. సోమశేఖర్ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఆన్ లివింగ్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్ ఏ కేస్ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: యువకుడిని ఇద్దరు మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పాత గుంటూరుకు చెందిన సువర్ణకుమారి కుమారుడు బ్రాడీపేటలోని ఓ సెల్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కొత్తపేటకు చెందిన సందీప్, ఖాజాలు అతడితో పరిచయం చేసుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఆ యువకుడు మెడలోని బంగారు గొలుసును ఇద్దరికీ ఇచ్చాడు. అనంతరం కొద్దిరోజుల తరువాత సందీప్, ఖాజాలు బెదిరించి కొన్ని పత్రాల మీద సంతకాలు చేయించి ఈఎంఐ కింద ఏసీ కొనుగోలు చేశారు. ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో కుమారుడి తరఫున సువర్ణకుమారి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎస్ నగర్‌కు చెందిన వెంకటేష్(35) ఆరు నెలల కిందట ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీల్ని సత్వరమే అమలుచేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

లక్ష్మీపురం: సూపర్ సిక్స్ హామీలని ప్రజలకు చెప్పి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం త్వరితగతిన వాటిని అమలు పరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శాఖా సమితి సమావేశాలు పెద్ది శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలు, వరదలు వల్ల మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ వయనాడ్ బాధితులకు బియ్యం, వస్తు రూపంలో సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ నగరంలో పీకల వాగు, రోడ్ల సమస్యపై పోరాటాలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత 25 సంవత్సరాలుగా నార్ల వెంకటేశ్వరరావు మెమోరియల్ నగర పాలక సంస్థ ఆడిటోరియం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో సగం నిర్మాణం జరిగి ఎందుకు పనికిరాని విధంగా ఉన్నదని గుర్తు చేశారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ఆడిటోరియాన్ని సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవయవ దానం మహత్తర ఆశయం



సమావేశంలో మాట్లాడుతున్న యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్

లక్ష్మీపురం: అవయవ దానం మహత్తర ఆశయమని హెల్త్ ఎవేర్ నెస్ అధ్యక్షుడు, ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ అవయవ దానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. చనిపోయిన తర్వాత కూడా మరికొంతమందిలో కొన్నేళ్లపాటు బతికే ఉంటారని చెప్పారు.

అవయవదాన ప్రచారకులు పి.భావన్నారాయణ, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవయవదానంపై చైతన్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయిలోనూ అవయవ దానం ప్రాధాన్యం, అవసరాన్ని గురించి పిల్లలకు తెలిసేలా పాఠ్యాంశాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, ఇంజినీర్ సదాశివం, సంస్థ సీనియర్ సభ్యుడు పి.జనార్దనరావు ప్రసంగించారు.

ఎస్‌సీఆర్ ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా సాంబశివరావు



సాంబశివరావుని సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

నగరంపాలెం: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఆటోడ్రైవర్స్ యూనియన్ (ఈస్ట్ సైడ్ రైల్వేస్టేషన్ గుంటూరు–1) అధ్యక్షుడిగా వై.సాంబశివరావు ఎన్నికయ్యారు. గుంటూరు తూర్పు వైపున్న రైల్వే స్టేషన్‌లో ఆదివారం యూనియన్ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం వై.సాంబశివరావు, షేక్ ఖలీల్, బి.సామ్యేల్ పోటీపడ్డారు. అధ్యక్షుడిగా సాంబశివరావు 66 ఓట్లతో గెలవగా, కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రయాణికుల్ని క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతామని నూతన అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. అనంతరం సభ్యులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సెబాష్టిన్, అక్బర్ అలీ, అహ్మద్ బాషా, ఎం.దేవా, డ్రైవర్లు పాల్గొన్నారు.

సమస్యల తిష్ట.. అప్రతిష్ట

- బురదగుంటగా మారిన రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణ
- రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లపై నిర్లక్ష్యం
- నిత్యం పార్కింగ్ సమస్య
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నెలల నుంచి మూత పడిన మరుగుదొడ్డి



బురదగుంటను తలపిస్తున్న రిజిస్ట్రేషన్ ఆవరణ

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ఖజానాకు ఆయువుపట్టులాంటి కార్యాలయాలుండే ప్రదేశమది. జిల్లా రెవెన్యూ ప్రధాన కార్యాలయం కూడా ఇక్కడే ఉంది. ఉన్నత ఉద్యోగులు సంచరించే ప్రదేశం. అయి నా సమస్యల వలయంలో చిక్కుకుని స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని రిజిస్ట్రేషన్, విద్యా శాఖ కార్యాలయ ఆవరణ చూపరులకు సైతం చికాకులు తెప్పిస్తోంది. దీనిపై ఇప్పటి వరకు ఆరుసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందినా స్పందనలేదు. సాక్షాత్తూ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవి ఈ ప్రదేశాన్ని పరిశీలించి సమస్యలు తన దృష్టికి తీసుకురమ్మన్నా పట్టించుకునే నాథుడే లేడు.

మౌలిక వసతులు కరువు

గత ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌లో రూ.30 లక్షల వ్యయంతో అంతర్గత రోడ్లు నిర్మించారు. అప్పటి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజతోపాటు కొందరు దాతల సహకారంతో ఇదే కాంపౌండ్‌లో రూ.12 లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించారు. దీన్ని కొన్ని రోజులు ఉపయోగించినా, విద్యుత్ సరఫరా లేకపోవడంతో గత రెండు నెలలుగా మూసే ఉంది. వర్షం పడి కొన్ని నెలలుగా నీరు నిలిచిపోవడంతో ఆవరణలో చాలా భాగం బురదగుంటలా మారిపోయింది. దాదాపు వెయ్యి చదరపు గజాల స్థలంలో మురుగు నీరు నిలిచిపోవడంతో అక్కడ వాహనాలు నిలపడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజల పార్కింగ్‌కు ఎంతో ఇబ్బందిగా మారింది. చిరు వ్యాపారులు చెత్తా చెదారం ఇక్కడే వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నా దీనిపై స్పందన లేకపోవడమేంటని ప్రజలు వాపోతున్నారు. కనీసం మంచినీటి సదుపాయం, పార్కింగ్, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మరుగుదొడ్లు కూడా కరువు



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పార్కింగ్ సమస్య చాలా ఎక్కువ. దీంతోపాటు మరుగు నిల్వ ఉండడంతో ఇక్కడ దోమల బెడద అధికం. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే మహిళలకు కనీసం మరుగుదొడ్లు కూడా అందుబాటులో ఉండడంలేదు. దీనిపై అధికారులు స్పందించాలని మనవి.

– రషీద్, స్థానికుడు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న హైమారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు పేర్కొన్నారు. ఆదివారం కొరిటెపాడులోని ఎస్ఆర్ఎంటి హైస్కూల్లో ఎన్‌టీఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైమారావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులకు న్యాయం చేయాలన్నారు. ఆరేళ్లుగా ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వారికి న్యాయం చేసే వరకు ఎన్‌టీఏ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులను నిబంధనల మేరకు అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని చెప్పారు. నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉన్న దృష్ట్యా తక్షణమే డిప్యూటేషన్‌పై నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాధ్యక్షుడు చుండి పద్మావతి మాట్లాడుతూ.. జీవో నెంబరు 179ను రద్దు చేయని పక్షంలో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అవుతాయని అన్నారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. సకాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు మంజూరు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు ఎన్‌టీఏలో సభ్యులుగా చేరాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, ఆర్థిక కార్యదర్శి జి.అంతోనీ బాబు, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, వి. సతీష్ కుమార్, కార్యదర్శులు కె.వేణుగోపాల్, హరగోపాల్, తాడేపల్లి మండల అధ్యక్షుడు కె. శ్యామ్‌కుమార్, నగరశాఖ అధ్యక్షుడు పి. సాయి విశ్వనాథ్, నాయకులు ఆనంగి శ్రీనివాసరావు, జి. అబ్రహం, హెచ్. రామకోటేశ్వరరావు, ఎం.బాలాజీ నాయక్, వై.శేఖర్‌బాబు, వివిధ మండలశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు

పెదకాకాని: శివాలయంలో రాహు కేతు పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం అమావాస్య విశేషమైన రోజు కావడంతో పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాహు కేతు మండపంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. వేకువ జామున 5 గంటల నుంచి ఈ పూజలు ప్రారంభమయ్యాయి. గ్రహ దోషాలు తొలగిపోయేందుకు రాహు కేతు పూజలు పెదకాకాని శివాలయంలో ప్రత్యేకంగా నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి 2,140 మంది ఈ పూజల్లో పాల్గొన్నారు.